ప్రాణం తీసిన భూ తగాదా

- కొత్తపల్లిలో ఒకరి దారుణ హత్య..
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ కృష్ణయాదవ్, సీఐ, ఎస్ఐలు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబర్ 19: కొంత కాలంగా గ్రామంలో జరుగుతున్న భూతగాదాల పంచాయితీ ఒకరి దారుణ హత్యకు దారి తీసిన సంఘటన పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఘటనా స్థలాన్ని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణయాదవ్, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ లక్ష్మణ్ రావు పరిశీలించి వివరాలు సేకరించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కలవేన సాయి కృష్ణ తండ్రి కలవేన రాజేశం రైల్వేలో ఉద్యోగం చేసి కొన్నేళ్ల క్రితం విరమణ పొందారు. అప్పటి నుంచి గ్రామంలో వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే తల్లిదండ్రులకు సంబంధించిన భూముల పంపకాల సమయంలో హెచ్చుతగ్గులపై పంచాయితీలు జరుగుతున్నాయి. ఈ విషయంలో కోర్టుకు వెళ్లారు. అక్కడ కూడా రాజేశంకు అనుకూలంగా తీర్పు వస్తుందని భావించిన ప్రత్యర్థి వర్గం రాజేశంను అడ్డుతొలగించుకోవాలని హత్యకు పథకం వేసుకున్నారు. గురువారం మధ్యాహ్నం రాజేశం కదలికలపై కన్నేసిన ప్రత్యర్థులు ఇంటి నుంచి పొలంవద్దకు వెళ్తున్న సమాచారం తెలుసుకొని వెంబడించారు. మధ్యాహ్నం కొత్తపల్లి-కొలనూర్ వెళ్లే రోడ్డు మార్గంలో కొత్తపల్లి రైల్వే స్టేషన్ ముందు ఆయన పొలం వద్దనే బుల్లెట్‌పై నుంచి పడేసి బండ రాళ్లతో ముఖంపై మోది చంపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భార్య దేవమ్మ, కుమారుడు సాయికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబర్19:కాల్వశ్రీరాంపూర్ కు ఇటీవల బదిలీపై వచ్చిన నూతన తహసీల్దార్ ఎండీ వకీల్ ను గురువారం బీఆర్ఎస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఇక్కడ మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచులు కాసం శ్రీనివాస్‌రెడ్డి, ఆడెపు శ్రీదేవిరాజు, కొనుకటి మల్లారెడ్డి, గోనే శ్యాం, బుర్ర మంగ సదానందం, మాజీ ఎంపీటీసీ కొలూరి రమ రాజమల్లు, కదురు మానస సతీశ్, మాజీ ఉప సర్పంచ్ సుదాటి కర్ణాకర్‌రావు లు ఉన్నారు.

పంచాయతీ కార్యాలయాల్లో స్టీల్ బ్యాంకులు

కమాన్‌పూర్/రామగిరి, సెప్టెంబర్ 19: జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్లాస్టిక్ వస్తువులు ఇక నుంచి వాడొద్దని నిర్ణయించారు. జిల్లాలోని 266 గ్రామ పంచాయతీలు ఉండగా, ప్రతి జీపీకి ఎవరైనా అధికారి వచ్చినప్పుడు లేదా గ్రామ సభలు జరిగినప్పుడు టీ తాగడానికి ప్లాస్టిక్ కప్పులు, గ్లాసులు, ప్లేట్లు లాంటి ప్లాస్టిక్ వస్తువులు వాడుతూ వస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య నూతన మార్పుకు శ్రీకారం చుట్టారు. మంథని, పెద్దపల్లి డీఎల్‌పీఓలు కొమ్మెర సతీశ్‌కుమార్, వేణుగోపాల్‌లు తమ పరిధిలోని జీపీ కార్యాలయాల్లో ప్లాస్టిక్ వస్తువులు బదులు స్టీల్ వస్తువులను కొనుగోలు చేయించారు. అన్ని పంచాయతీల్లో ఈ విధానం అమలు చేయాలని ఆదేశించడంతో కార్యదర్శులు స్టీల్ వస్తువులను కొనుగోలు చేశారు. ప్లాస్టిక్ వస్తువులు కనిపిస్తే కార్యదర్శులపై చర్యలు ఉంటాయని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

నాగారంలో రేషన్ బియ్యం పట్టివేత

మంథని రూరల్, సెప్టెంబర్ 19: మంథని మండలం నాగారం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 48.8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్ తెలిపారు. సివిల్ సప్లయిస్ కమిషనర్ కార్యాలయ ఓఎస్డీ ప్రభాకర్ రెడ్డి పక్కా సమాచారంతో మంథని మండలం నాగారం గ్రామంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. మంథని మండలం నాగారం గ్రామంలో మినీ డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 48.8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తనిఖీల్లో పట్టుకున్నట్లు తెలిపారు. 48.8 క్వింటాళ్ల రేషన్ బియ్యం, మినీ డీసీఎం వ్యాన్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని మంథని ఎంఎల్ఎస్ పాయింట్ తరలించామని, డీసీఎం వ్యాన్‌ను మంథని ఠాణాలో అప్పజెప్పామని తెలిపారు. రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థ నియంత్రణ ఉత్తర్వులు 2016 ప్రకారం వాహనం యజమాని, డ్రైవర్, అక్కడ పనిచేస్తున్న ఇతర లేబర్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించామని చెప్పారు. అక్రమ రేషన్ బియ్యం విలువ రూ. 2.78 లక్షలు ఉంటుందని తెలిపారు. తనిఖీలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌లో విద్యుత్ కోతలు

- ఉక్కపోతతో అల్లాడుతున్న బాలింతలు, గర్భిణులు

ఎంసీహెచ్‌లో బాలింతలు, గర్భిణులు

పెద్దపల్లి, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రమైన పెద్దపల్లి మాతా శిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్)లో నిత్యం విద్యుత్ కోతలతో బాలింతలు, నవజాత శిశువులు అల్లాడుతున్నారు. ఎంసీహెచ్‌లో దాదాపు 120 ఇన్‌పేషెంట్లు ఉండగా, ప్రతి రోజు దాదాపు 200 దాకా ఓపీ ఉంటుంది. ఈ క్రమంలో పగటి పూట పవర్ లేక గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నవజాత శిశువులు వేడి తట్టుకోలేక గుక్కపెట్టి ఏడుస్తుండటంతో కన్న తల్లి హృదయం తల్లడిల్లిపోతున్నది. అలాగే ఓటీ, ఐసీయూ, లేబర్ రూమ్, వార్డుల్లో కరెంట్ లేకపోవడంతో రోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో గత కొంత కాలంగా రోగుల సంఖ్య జిల్లా దవాఖానలో విపరీతంగా పెరిగింది. వాతావరణంలో కలిగిన మార్పుల కారణంగా విషజ్వరాలు వ్యాప్తి చెందడంతో ప్రతీ రోజు జిల్లా దవాఖానకు దాదాపుగా 800ల వరకు ఔట్ పేషెంట్లు వస్తున్నారు. ఎంసీహెచ్‌కు ప్రతీ రోజు దాదాపుగా 200ల వరకు ఔట్ పేషెంట్లు వస్తున్నారు. ఈ సమయంలో తరచూ ఎంసీహెచ్, జిల్లా దవాఖానలో కరెంటు కోతల కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ తరచూ విద్యుత్ అంతరాయం కలగడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దవాఖానలోని బెడ్లపై పడుకున్న రోగులకు విసురుతూ పేషెంట్ సహాయకులు కాస్త ఊరటనిచ్చారు. వాతావరణం పూర్తిగా భిన్నంగా ఎండ సైతం దంచికొడుతుండడంతో వేడిని రోగులు తట్టుకోలేకపోతున్నారు. విద్యుత్ ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓవర్ లోడుతో సతాయిస్తున్న జనరేటర్..

జిల్లా దవాఖాన, మాతా శిశు సంరక్షణ కేంద్రం రెండింటికీ ఒకే జనరేటర్‌తో విద్యుత్ సరఫరా చేస్తున్నారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆసుపత్రిలో ఒక వైపు పెద్ద ఎత్తున ఔట్ పేషెంట్లు రావడం, మరో వైపు ఎంసీహెచ్‌లో 120 వరకు ఇన్ పేషెంట్లు ఉడటంతో అన్ని చోట్ల ఉన్న లైట్లు, ఫ్యాన్లు ఆన్ చేయడంతో జనరేటర్ తరచూ ఆఫ్ అవుతూ వచ్చింది. ఎన్ని సార్లు ఆన్ చేసిన తిరిగి ఆఫ్ కావడంతో విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు కలిగాయి. ఆసుపత్రిలో జనరేటర్ 125కేవీ కెపాసిటీ కలిగినది కాగా కెపాసిటీకి మించి విద్యుత్ వినియోగం చేస్తుండటంతో విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం..

జిల్లా ఆసుపత్రి, ఎంసీహెచ్‌కు కలిపి ఒకే జనరేటర్ ఉంది. దాంతో ఓవర్ లోడ్ కారణంగా తరచూ జనరేటర్ ఆఫ్ అవుతున్నది. దాంతో ఆసుపత్రిలో విద్యుత్ సరఫరాకు ఇబ్బందిగా మారింది. విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు తెలియజేసి ప్రత్యామ్నాయ మార్గాలను చూస్తున్నాం. జిల్లా ఆసుపత్రిలో మరో జనరేటర్ పాతది ఉంది. దాన్ని పునరుద్ధరించి అవసరమైన మెటీరియల్ కొటేషన్ తెప్పించి జిల్లా ఆసుపత్రికి వేరుగా, ఎంసీహెచ్‌కు వేరుగా రెండు జనరేటర్లతో విద్యుత్ సరఫరా చేస్తాం. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం.

-డాక్టర్ కొండ శ్రీధర్, డీసీహెచ్ఎస్ (పెద్దపల్లి).

ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో భారీ చోరీ

జ్యోతినగర్, సెప్టెంబర్ 19: ఎన్టీపీసీ లోని కృష్ణానగర్‌లో బుధవారం రాత్రి తులసి హరిప్రసాద్‌కు చెందిన ఇంట్లో గుర్తుతెలియని దొంగలు చొరబడి పెద్ద ఎత్తున చోరికి పాల్పడ్డారు. 9 తులాల బంగారు అభరణాలు, కిలో వెండి అభరణాలు, రూ. 1.50 లక్షల నగదు దోచుకున్నారు. ఎన్టీపీసీ ఎస్ఐ కే సతీశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుందనపల్లిలోని ఐఓసీ పెంట్రోల్ బంక్ నిర్వాహకుడు తులసి హరిప్రసాద్ తన తల్లి అనారోగ్యానికి గురవడంతో చూసేందు ఈ నెల 16న ఇంటిల్లిపాది నల్గొండ జిల్లాకు వెళ్లారు. గురువారం ఇంటి పనిమనిషి పనిచేయడానికి ఇంటికి రాగా, తాళం పగులగొట్టిన దొంగలు, ఇంట్లో వస్తులు సోదాలు చేసినట్లు కనిపించడంతో యాజమానికి సమాచారం అందించింది. ఇంటికి వచ్చిన హరిప్రసాద్ బంగారం, వెండి ఆభరణాలు, నగదు చోరీ జరిగినట్లు ఎన్టీపీసీ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చోరీ చేసిన అభరణాల విలువ రూ. 3.90లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఘటనా స్థలానికి వెళ్లిన ఎస్ఐ డాగ్‌స్కాడ్, క్లూస్ టీమ్‌తో విచారణ చేపట్టారు.

ఎన్టీపీసీలో ఉత్సవ కమిటీ ఏర్పాటు

జ్యోతినగర్, సెప్టెంబర్ 19: ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో వేడుకల నిర్వహణకు యాజమాన్యం ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసింది. 2024-25కు గాను రామగుండం, తెలంగాణ ప్లాంటులోని జరిగే ప్రధాన పండుగలు ఒకే వేదికపై ఉత్సవ కమిటీ నిర్వహణలో కొనసాగించాలని రామగుండం ఎన్టీపీసీ డిప్యూటీ జీఎం(హెచ్ఆర్) సర్క్యులర్ జారీచేశారు. ఆగస్టు 26న జరిగిన యూనిఫైడ్ ఫెస్టివల్ కమిటీ సమావేశంలో యూనియన్, అసోసియేషన్ల ప్రతినిధుల సమక్షంలో స్టీరింగ్ కమిటీ చైర్మన్ ఓఅండ్ఎం జీఎం అలోక్‌కుమార్ త్రిపాఠి అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్ణయం మేరకు ఉత్సవ కమిటీని అన్ని విభాగాల్లో కమిటీలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. రాబోయే అన్ని ప్రధాన పండుగలను ఒకే వేదికపై జరుగనున్నట్లు సర్క్యూలర్‌లో పేర్కొన్నారు.

పెరటి కోళ్ల పంపిణీ

ఓదెల, సెప్టెంబర్ 19: ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో స్వశక్తి మహిళలకు పెరటి కోళ్లను ఓదెల సెర్ప్ కార్యాలయంలో గురువారం పంపిణీ చేశారు. బ్యాంక్ లింకేజీ , స్త్రీనిది రుణం, గ్రామ సంఘం నుండి సంఘ అప్పుల ద్వారా పెరటి కోడి పిల్లలను పెంచడానికి ఇవ్వడం జరిగింది. జీలకుంట గ్రామానికి చర్లపల్లి కవిత మదర్ యూనిట్ కింద 1000కోడి పిల్లలను ఇవ్వడం జరిగినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం లతామంగేశ్వరి, సీసీలు శ్రీనివాస్, మల్లయ్య, కొమురయ్య, విజయ, రాజకుమారి, భవానీ, పవన్‌కుమార్, వీఓఏలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాల అందజేత

కోల్‌సిటీ, సెప్టెంబర్ 19: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారులకు అర్హత పత్రాలను అందజేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆదేశాల మేరకు గురువారం నగర పాలక సంస్థ 11వ డివిజన్‌లో కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్ అర్హులైన మహిళలకు అర్హత పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌పీ సరోజనతోపాటు లబ్ధిదారులు పాల్గొన్నారు. అలాగే 33వ డివిజన్‌లో కార్పొరేటర్ దొంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్యాస్ సబ్సిడీ పథకం పత్రాలను మహిళలకు అందజేశారు. ఇంకా ఈ పథకంకు అర్హత ఉండి వర్తించని మహిళలు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని సూచించారు. ఇక్కడ ఆర్‌పీలు రాజకుమారి, విజయలక్ష్మి, యుగంధర్, జంగ స్వామి, గడ్డం శ్రీను, డివిజన్ మహిళలు పాల్గొన్నారు.

పీసీసీ ప్రెసిడెంట్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

గోదావరిఖని, సెప్టెంబర్ 19: తెలంగాణ రాష్ట్ర పీసీసీ ప్రెసిడెంట్‌గా ఇటీవల ఎన్నికైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సన్మానించారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన వివిధ కులాల ఆత్మీయ అభినందన సభలో ఎమ్మెల్యే మహేశ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు.

వైద్య శిబిరానికి స్పందన

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబర్ 19 : హనుమాన్‌నగర్‌లో బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ కోండ్ర స్టాలీన్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రీనేత్రాలయ కంటి దవాఖాన సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిభిరానికి స్పందన లభించింది. హస్పిటల్ డైరెక్టర్ చైతన్యారెడ్డి 190 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 18మందికి ఆధునాత వైద్య పరీక్షల కోసం హైదరాబాద్‌లోని ప్రధాన దవాఖానకు తీసుకెళ్లి ఉచితంగా వైద్యం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమణారెడ్డి, సంజీవరెడ్డి, రాజేందర్, కే. సత్యనారాయణ గౌడ్, అంజయ్యగౌడ్, రాంబాబు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో రోడ్డు మరమ్మతు

ఓదెల, సెప్టెంబర్ 19: పెద్ద కొమిరె నుంచి భీమరపల్లి వరకు ఊర చెరువు కట్ట పై సొంత డబ్బులు వెచ్చించి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి రోడ్డు మరమ్మతు చేపట్టారు. చెరువు కట్టపై ఇరువైపులా ముళ్ల పొదలు ఉండి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో సొంత డబ్బులు వెచ్చించి సాగర్‌రెడ్డి గురువారం ఎక్స్‌కవేటర్‌తో మరమ్మతు చేపట్టారు. ఇందుకు సాగర్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాపర్తి మల్లేశ్‌గౌడ్, గోలి లింగారెడ్డి, కొత్తిరెడ్డి రాజిరెడ్డి, వెంకటస్వామి, సంపత్, రాములు, నాగరాజు, కోమల్‌రెడ్డి, సారయ్య, ఓదెలు పాల్గొన్నారు.

సింగరేణి క్వార్టర్ల తనిఖీ

గోదావరిఖని, సెప్టెంబర్ 19: తిలక్‌నగర్‌లోని సింగరేణి క్వార్టర్లను ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. కార్మిక కుటుంబాలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. క్వార్టర్లలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను జీఎం ఆదేశించారు. ఇక్కడ ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ ఆరెల్లి పోషం, ఓస్ఓటూ జీఎం రామ్మోహన్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఏరియా ఇంజినీర్ దాసరి వెంకటేశ్వర్‌రావు, ఏజీఎం ఐఈడీ ఆంజనేయులు, డీజీఎం వర్క్‌షాప్ జితేందర్‌సింగ్, సర్వే అధికారి ప్రభాకర్, డీవైఎస్సీ వసంత్‌కుమార్, వరప్రసాద్, ఫారెస్ట్ అధికారి కర్ణ, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఉన్నారు.

స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్

స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 4.0లో భాగంగా పవర్‌హౌజ్ కాలనీలో చేపట్టిన స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్‌ను ఆర్జీ-1 జీఎం డీ లలిత్‌కుమార్ ప్రారంభించారు. లైబ్రరీ వద్ద పరిసరాలను శుభ్రపరిచారు. ఇక్కడ ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సర్వే అధికారి ప్రభాకర్, సీనియర్ పీఓ హన్మంతరావు ఉన్నారు.

ట్రినిటీలో స్వచ్ఛతా హీ సేవా

పెద్దపల్లి కమాన్, సెప్టెంబర్ 19 : పెద్దపల్లి డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కళాశాల పరిసరాలల్లో పిచ్చి మొక్కలను తొలగించి, మొక్కలను నాటారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ హాజరై స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నీతారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అశ్విని, సంజీవ్, విద్యార్థులు తదతదితులున్నారు.

ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను అమ్మేసిన కేంద్రం

రూ.320 కోట్లకు జపాన్ సంస్థకు విక్రయం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: కేంద్ర సర్కార్ మరో ప్రభుత్వరంగ సంస్థను అమ్మేసింది. వాటాల విక్రయంలో భాగంగా ఫెర్రో స్క్రాప్ నిగం లిమిటెడ్(ఎఫ్ఎస్ఎన్ఎల్)ని జపాన్‌కు చెందిన కోనాయికీ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్‌కు రూ.320 కోట్లకు విక్రయించింది. స్టీల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్..ఎంఎస్‌టీసీ లిమిటెడ్‌కు చెందిన 100 శాతం సబ్సిడరీ సంస్థ. ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్ విక్రయానికి కేంద్రం గతంలోనే నిర్వహించిన బిడ్డింగ్ ప్రక్రియకు రెండు బిడ్డింగ్‌లు టెక్నికల్‌గా అర్హత సాధించాయి. వీటిలో జపాన్‌కు చెందిన కోనాయికీ అత్యధికంగా రూ.320 కోట్ల బిడ్డింగ్ దాఖలుకు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, హెచ్‌డీ కుమార స్వామి నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రిజర్వు ధర రూ.262 కోట్లుకాగా, బిడ్డింగ్ రూ.320 కోట్లు దాఖలవడంతో దీనికి మొగ్గుచూపింది కేంద్రం. మరో బిడ్ ఇండిక్ జియో రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్(చందన్ స్టీల్ లిమిటెడ్‌కు చెందిన సబ్సిడరీ సంస్థ) దాఖలు చేసినట్లు తెలిపింది. టోక్యో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టైన కోనాయిక్ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్. సంస్థకు స్టీల్ రంగంలో 140 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది. 1979 నుంచి ఎఫ్ఎస్ఎన్ఎల్ స్టీల్ మిల్ సేవలను అందిస్తున్నది. పలు స్టీల్ ప్లాంట్ల నుంచి సేకరించిన స్క్రాప్ స్టీల్‌ను తిరిగి వినిమయంలో తెస్తున్నది సంస్థ.

హైదరాబాద్‌లో అల్ట్రావయలెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన మోటార్‌సైకిళ్ల తయారీ సంస్థ అల్ట్రావయలెట్... తాజాగా రాష్ట్రంలోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లో తన తొలి షోరూంను గురువారం ప్రారంభించింది. దీంతో సంస్థకు ఇది ఐదో షోరూం కావడం విశేషం. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, కో-ఫౌండర్ నారాయణ్ సుబ్రమణియమ్ మాట్లాడుతూ.. వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అడుగుపెట్టినట్లు, ఈ ఏడాది చివరినాటికి మొత్తం అవుట్‌లెట్ల సంఖ్యను పదికి పెంచుకోబోతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అధిక మైలేజీని కోరుకుంటున్నవారిని దృష్టిలో పెట్టుకొని తొలి మాడల్ ఎఫ్77ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 320 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నదన్నారు. దీంట్లో 7.1 కిలోవాట్లా బ్యాటరీ కలిగిన మాడల్ ధర రూ.2.99 లక్షలుగాను. 10.1 కిలోవాట్లా బ్యాటరీ మాడల్ రూ.3.99 లక్షలుగా నిర్ణయించింది. మరోవైపు, శుక్రవారం సంస్థ గంటకు 265 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఎఫ్99ని స్పోర్ట్స్ బైకును ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. వచ్చే 2-3మూడేండ్లలో మరో 3-4 మాడళ్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించిన ఆయన... ఈ బైకులపై ఎనిమిదేండ్లు లేదా 8 లక్షల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది.

సేల్స్‌ఫోర్స్ విస్తరణ

శాన్ ఫ్రాన్సిస్కో, సెప్టెంబర్ 19: కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ సేల్స్‌ఫోర్స్..భారత్‌లో తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరులలో ఉన్న సెంటర్లను ఆధునీకరించడానికి మరిన్ని పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి బ్రియాన్ మిల్హమ్ తెలిపారు. మరోవైపు, కంపెనీ దేశీయ హెడ్ అరుంధతీ భట్టాచార్య మాట్లాడుతూ..భారత్‌లో ఉద్యోగుల సంఖ్యను గడిచిన రెండేండ్లలో రెండింతలు పెంచినట్లు, ప్రస్తుతం 13 వేల మంది విధులు నిర్వహిస్తున్నారని, మరింత మందిని తీసుకునే అవకాశాలున్నట్లు చెప్పారు.

హెరిటేజ్ ఐస్‌క్రీం ప్లాంట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్..తాజాగా తెలంగాణలో ఐస్‌క్రీం ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. షామీర్‌పేట్‌లో రూ.204 కోట్ల పెట్టుబడితో నెలకొల్పబోతున్నట్లు తెలిపింది. ఈ ప్లాంట్ ఏర్పాటునకు సంబంధించి కంపెనీ బోర్డు డైరెక్టర్లు సమావేశమై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో ఐస్‌క్రీంకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో పెట్టుకొని ఈ యూనిట్‌ను నెలకొల్పాలని నిర్ణయించినట్లు, వచ్చే ఏడాది నవంబర్ నాటికి ఈ యూనిట్ అందుబాటులోకి రానున్నట్లు కంపెనీ వర్గాల వెల్లడించాయి.

వాణిజ్య



టప్పర్‌వేర్ దివాలా

ఆర్థిక సంక్షోభంలో ప్లాస్టిక్ కిచెన్‌వేర్ దిగ్గజం • అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు

తగ్గిన గిరాకీ, పెరిగిన పోటీతో కుదేలు • రూ.10వేల కోట్ల రుణ భారం

'దివాలా ప్రక్రియ అంటే సంస్థ మనుగడకు కావాల్సిన వెసులుబాట్లను కల్పించడమే. ఈ కంపెనీ ఎక్కడికీ పోదు. ఎప్పట్లాగే ఇకపైనా మా నాణ్యమైన ఉత్పత్తులు మార్కెట్‌లో లభిస్తాయి'

-లారీ అన్ గోల్డ్‌మన్, టప్పర్‌వేర్ అధ్యక్షుడు, సీఈవో

న్యూయార్క్, సెప్టెంబర్ 19: ప్రముఖ ప్లాస్టిక్ కిచెన్‌వేర్ బ్రాండ్ టప్పర్‌వేర్ దివాలా తీసింది. అమెరికా బ్యాంక్‌రప్సీ కోర్టులో చాప్టర్ 11 బ్యాంక్‌రప్సీ రక్షణను కోరుతూ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఆహార పదార్థాల నిల్వలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఈ సంస్థ.. ప్రస్తుత మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకోలేక చతికిలపడింది. పర్యావరణ పరిరక్షణపై పెరిగిన అవగాహన, ప్లాస్టిక్ వినియోగంపై మారుతున్న కస్టమర్ల అభిప్రాయాలు సైతం టప్పర్‌వేర్ అమ్మకాలకు గండి కొట్టాయి.

80 ఏండ్ల కిందట..

అమెరికాలోని ఫ్లోరిడాలోగల ఓర్లాండో ప్రధాన కేంద్రంగా 1942లో టప్పర్‌వేర్ బ్రాండ్‌ను ఎర్ల్ టప్పర్ స్థాపించారు. 1946లో మార్కెట్‌కు వీటి ఉత్పత్తులు పరిచయమయ్యాయి. అప్పట్నుంచి టప్పర్‌వేర్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతూ వచ్చింది. కానీ మార్కెట్‌లో పెరిగిన పోటీతో అమ్మకాలు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. క్లీనెక్స్, టెఫ్లాన్, ఇతర బ్రాండ్ల దూకుడు ముందు టప్పర్‌వేర్ నిలదొక్కుకోలేకపోయింది. ఇక డైరెక్ట్ సేల్స్ నుంచి వినియోగదారులు దూరం జరుగడం కూడా సంస్థ వ్యాపారాన్ని దెబ్బతీసిందని దివాలా పిటిషన్‌లో టప్పర్‌వేర్ పేర్కొన్నది.

పీకల్లోతు అప్పులు

దివాలా పిటిషన్ ప్రకారం టప్పర్‌వేర్‌పై రూ.10,000 కోట్ల (1.2 బిలియన్ డాలర్లు) రుణ భారం ఉన్నది. రుణదాతలతో చేసుకున్న ఒప్పందాలనూ ఇది మీరినట్టు తెలుస్తున్నది. అయితే సుమారు రూ.5,700 కోట్ల (679.5 మిలియన్ డాలర్ల) ఆస్తులు కూడా ఉన్నట్టు కంపెనీ చెప్తున్నది. ఇక